క్లుప్తంగా

అడ్మిషన్ ఫీజు చెల్లించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్ సపోర్టు సెంటర్‌లో మొదటి, రెండో, మూడో సంవత్సరం డిగ్రీ అడ్మిషన్ ఫీజు చెల్లించాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ బి.ఓబుల సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు జూలై 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు 7382929677 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని జూలై 3వ తేదీన బద్వేలు డిపో నుంచి అరుణాచలంకు రెండు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు నుంచి అరుణాచలంకు అల్ట్రాడీలక్స్ స్పెషల్ బస్సు జూలై 2వ తేదీన ఉదయం 5:30 గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు వెళుతుందని, టికెట్ ధర రూ.1530లు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మరో సూపర్‌లగ్జరీ బస్సు జూలై 2వ తేదీ ఉదయం 6 గంటలకు బద్వేలులో బయలుదేరి కడప మీదుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు వెళుతుందని, ఇందుకు టికెట్ ధర రూ.1230లు నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరపత్రాలు పంపిణీ

ప్రొద్దుటూరు : ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన 9 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ నేతలు మంగళవారం 33వ వార్డులో ఇంటింటా పర్యటించారు. సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూత్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు పరమేశ్వరరావు, ముత్యాల శ్రీశ్రీ, చలపతి రావు, కుమారి, కుమార్ యాదవ్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న రూరల్ సీఐ, ఎస్‌ఐ

చాపాడు : స్థానిక పోలీసు స్టేషన్‌లో పని చేస్తూ బదిలీ అయిన నలుగురు కానిస్టేబుళ్లకు బుధవారం పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. శ్రీహరి, తిరుపతయ్య దువ్వూరు పోలీసుస్టేషన్‌కు, నాగేంద్ర ప్రొద్దుటూరు త్రీటౌన్‌కు, జయదేవ్ సిద్దవటం పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా ఎస్‌ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

నేడు సీఎస్‌ఐ చర్చిలో ఆరాధన మహోత్సవాలు

చాపాడు : మండలంలోని ఎన్.ఓబాయపల్లె గ్రామంలో సీఎస్‌ఐ చర్చి 35 వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఉదయం 9గంటలకు ఆరాధన మహోత్సవ వేడుకలకు హాజరుకానున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

కుష్టువ్యాధిపై సర్వే



మచ్చలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తించు సర్వే కార్యక్రమం నిర్వహించారు. డీపీఎంఓ శ్రీనివాస్ మాట్లాడుతూ అనుమానాస్పద పొడలను, మచ్చలు ఉన్న వారిని పరీక్షించినట్లు తెలిపారు. ఇంత వరకు గుర్తించినవి మామూలు మచ్చలు, పొడలేనని, కుష్టు వ్యాధి కాదని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఎలాంటి మచ్చలు, పొడలు ఉన్నా ఆరోగ్య సిబ్బందికి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీనారాయణ, యశోద, బిందు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

చాపాడు : ఈ నెల 27న సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అత్యాపాత్య క్రీడాకారుల ఎంపికలో మండలంలోని అయ్యవారిపల్లె జెడ్పీ హైస్కూల్ ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప తెలిపారు. అండర్-14 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కిన్నెర, 7వ తరగతికి చెందిన సుస్మిత, సమీరూన్ బీలు రాష్ట్ర స్థాయి అత్యాపాత్య పోటీలకు ఎంపికయ్యారు. జూలై 1, 2వ తేదీల్లో కాకినాడ జిల్లా తునిలో జరుగబోవు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు శివారెడ్డి, విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రంగాపురం, మల్లాయపల్లె, హరిజనవాడలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు అందుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు.

విద్యార్థులతో మాటమంతి

స్కూల్‌కు వెళుతున్న విద్యార్థులతో ఎమ్మెల్యే మాటమంతి కలిపారు. యూనిఫాం ఎలా ఉంది. మీ స్కూల్‌లో భోజనం ఎలా ఉంది.. అన్ని వసతులు బాగున్నాయా అని అగిడి తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానంతో సంతృప్తి చెందారు.

డ్రైనేజీ నిర్మాణానికి హామీ

రంగాపురం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి ప్రత్యేక నిధుల ద్వారా డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు. అనంతరం ఆలయంలలోని చౌడేశ్వరి అమ్మవారు, సీతా రాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ పుల్లయ్య సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, అప్పనపల్లె ఎంపీటీసీ బండి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, నాయకులు పట్టుపోగుల పుల్లాయ్య, సర్పంచ్ లక్ష్మయ్య, పట్టుపోగుల శ్రీను, పూజలరమణయ్య, పుల్లగూరు సుబ్బరాయుడు, సాంబయ్య పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం మంచి సేవలు అందించాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ నూతన పాలకవర్గం మంచి సేవలు అందించాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడుగా శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శిగా గజ్జల వెంకటేశ్వరరెడ్డితోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సంర్భంగా బుధవారం రాత్రి రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి మైదుకూరు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. అదే తరహాలో నూతన పాలకవర్గం మరిన్ని సేవలు అందించాలని కోరుకుంటున్నానన్నారు. అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాదరెడ్డి మాట్లాడుతూ 1960లో రోటరీ క్లబ్ ఏర్పాటైందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుకు ఎంపికైన డీకే చదువుల బాబు, స్పందన సుబ్బరామిరెడ్డి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రామకృష్ణ, బాలసూర్యారావు, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ సాధు గోపాలకృష్ణ, సంస్థ ప్రతినిధి ఎంవీఎస్ ప్రభు, బాలాజీ, జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

యువత చేతిలోనే వారి భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : యువత భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని.. చదువుకున్న యువత ఏదైనా సాధించగల సమర్థులని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, వైఎస్సార్ జిల్లా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీబీఐటీ కాలేజీలో యువ ఉత్సవ్-2023 కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవ్‌లో యువతకు పంచ్ ప్రాణ్ ఆఫ్ అమ్రిత్ కాల్ అనే అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిస్, వ్యక్తిగత విభాగాలలో కల్చరల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ జనాభాలో యువత అధికంగా ఉందన్నారు. యువత సాధించే విజయాలతో భారత ఆర్థిక వ్యవస్థ ఇతర దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. యువత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్ల ఖర్చు చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులకు అధిక విజ్ఞానం ఉంటుందని ఈ క్రమంలో మైదుకూరు నియోజకవర్గంలో నాగులపల్లె, చిన్నయ్యగారిపల్లె గ్రామాల నుంచి ఇటీవల కాలంలో ఇద్దరు కలెక్టర్‌లుగా అయ్యారన్నారు. అనంతరం వివిధ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంత, సాధన ఐఏఎస్ అకాడమి వెంకటేశ్వరరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగింది



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. సంఖ్యకు అనుగుణంగా విద్యను బోధించేందుకు విద్యావలంటీర్లను నియమించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ మోడంపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 1300 పెరిగిందని, వెంటనే విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో వచ్చిన మార్పుల వల్లే ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయన్నారు. ఉన్నత పాఠశాలల్లో సీట్ల కోసం తాము రెకమెండేషన్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సీట్లు ఇప్పించాలని కోరుతున్నారని తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ గతంలో మున్సిపల్ పాఠశాలలు తమ ఆధీనంలో ఉండేవని, ప్రస్తుతం అన్ని పాఠశాలలను ఒకే గొడుగు కిందకు ప్రభుత్వం తెచ్చిందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అనుమతి ఉంటే తప్పకుండా విద్యావలంటీర్లను నియమిస్తామని చెప్పారు. శ్రీరాములపేటలోని 9/222 ఇంటి నంబర్‌లో అనుమతి లేకుండా బిల్డింగ్ నిర్మిస్తున్నారని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా అన్నారు. బిల్డింగ్ వాణిజ్య సముదాయమా.. లేక లాడ్జినా చెప్పాలని తాను చాలా రోజులుగా కోరుతున్నానన్నారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని, నిబంధనల మేరకు తాము పనులు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. మోక్షగుండం వీధిలో అనుమతులు లేకుండా భవనం నిర్మిస్తున్నారని మూడు నెలల కిందటే తాను తెలిపానని 23వ వార్డు కౌన్సిలర్ వద్ద ఖలీల్ బాషా చెప్పారు. కోట్ల రూపాయలు వెచ్చించి అన్ని వసతులతో గాంధీ పార్కును తన వార్డులో నిర్మిస్తున్నందుకు 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు మున్సిపల్ పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్కును చక్కగా మెయింటెనెన్స్ చేయాలని అధికారులను కోరారు. స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా మైదుకూరు రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.38.50 లక్షలతో టెండర్లు పిలిచినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. బుడ్డాయపల్లె నుంచి గోపి రైస్ మిల్లు మీదుగా దొరసానిపల్లె రోడ్డు వరకు డ్రైనేజి కాలువలతోపాటు రోడ్డు విస్తరణ పనులు చేసేందుకు టెండర్ వేసిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంలో ఆలస్యం చేయడంతో పనిని రద్దు చేసేందుకు కౌన్సిల్ తీర్మానించింది. 4వ వార్డు పరిధిలోని సున్నపు వారి వీధిలో రోడ్డు నిర్మించేందుకు రూ.35 లక్షలతో అంచనాలను తయారు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న శ్రీఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయానికి నూతన పాలకమండలిని నియమించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సత్యనారాయణ, పాలక మండలి సభ్యుడు సుంకు కిశోర్ బాబు, ఆర్యవైశ్య ప్రముఖులు బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానించారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని వారు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కామిశెట్టి కృష్ణమూర్తి, వల్లంకొండు మనోహర్, దరిశ సుబ్బారావు, కానపల్లె కృష్ణ, శ్రీధర్, అశోక్, నాగెళ్ల శ్రీను, 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత

ప్రొద్దుటూరు : భావి తరాల కోసం పర్యావరణ పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు తెలిపారు. స్థానిక పశువైద్య కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ మాసాన్ని పురస్కరించుకుని పశువైద్య విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో నిష్ణాతులైన ప్రొఫెసర్ మహేష్‌చందర్ మాట్లాడుతూ మన ఆరోగ్యానికి, పర్యావరణ క్షేమానికి సేంద్రియ వ్యవసాయం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. యోగివేమన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మమత పర్యావరణ పరిరక్షణలో నానో టెక్నాలజీ పాత్ర గురించి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మస్తాన్ బీ నీటి వనరుల సద్వినియోగం, సంక్షేమం గురించి వివరించారు. లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్ విభాగం సహాయక ప్రొఫెసర్ కుట్టి కుమార్ ఎలక్ట్రానిక్ వ్యవర్థాల వల్ల పర్యావరణానికి కలిగే హానిని, సరైన పద్ధతిలో వాటిని పారవేయు విధానాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌టెన్షన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీత ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు పి.కళ్యాణి, ప్రశాంత్ బాబు పాల్గొన్నారు.

పీఎంఎఫ్ఎంఈ పథకంపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి రామకృష్ణ

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) గ్రామీణ మహిళలకు సువర్ణ అవకాశం అని మైదుకూరు ప్రాంత ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. ఈ పథకంపై బుధవారం మైదుకూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ వ్యాపారంలో అన్ని విధాలా తోడ్పాటును అందించి ఆధునిక సాంకేతికతో పెద్ద వ్యాపారులకు దీటుగా పోటీకి నిలపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీఆర్పీ మధుజీసూదన రావు, మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజన్న కవి జీవిత సంగ్రహ పుస్తకం ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ కవి సగబాల రాజన్న 92వ జయంతి సందర్భంగా ఆయన జీవిత సంగ్రహ పుస్తకాన్ని, ఆయన జ్ఞాపకార్థం కాటన్ బ్యాగ్‌లను అమరావతి ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించినట్లు డాక్టర్ ఎం.ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ డాక్టర్ రామాచార్యులు, గొర్ల నారాయణరావు, డాక్టర్ గుమ్మా సాంబశివ రావు, తులసి రాజశేఖర్, సత్య సులోచన, అప్స, శ్రీవాణి పాల్గొన్నారని ఆయన వివరించారు.

ఖాతాదారుల శ్రేయస్సే బ్యాంకు లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం శర్మ

బి.కోడూరు : ఖాతాదారులు, రైతులు అభివృద్ధి పథంలో పయనించడంతోపాటు బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని భారతీయ స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్ కే.వి.కే.కే.ఎస్.శర్మ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పెద్దుళ్ళపల్లె గ్రామంలో బద్వేలు ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రాత్రి శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ రైతులు ఖాతాదారులు బ్యాంకు అందించే వివిధ రకాల సేవలను, రాయితీలను సద్వినియోగం చేసుకుని వారు అభివృద్ధి చెందడమే కాకుండా బ్యాంకు అభివృద్ధికి దోహదం చేయాలని తెలిపారు. అంతేకాకుండా ఏ బ్యాంకు అందించనంతగా భారతీయ స్టేట్ బ్యాంకు వారు రైతులకు పంట రుణాలు, వ్యవసాయ రుణాలు తక్కువ వడ్డీతో అందించడంతో పాటు డిపాజిట్‌దారులకు అధిక వడ్డీ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బద్వేలు స్టేట్ బ్యాంక్ మేనేజర్ జి.వి.ఎస్.రమేష్, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ వై.పార్థసారథిరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సంధ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : నెల రోజుల పాటు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి తెలిపారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని 3, 4 సచివాలయాలకు సంబంధించి బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలన్నింటినీ జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దా మోషా, ఉప సర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి, ఎంపీటీసీలు ఓబయ్య యాదవ్ పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే..

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేని అర్హులను గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్, గుంతపల్లె, కుమ్మరికొట్టాలు, తొట్టిగారిపల్లె సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏ ఒక్కరు కూడా పథకాలు అందలేదనే పరిస్థితి ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ప్రజల సమస్యలను గుర్తించాలని కోరారు. అలాగే ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను పూర్తి ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి చెన్నకృష్ణారెడ్డి, గంగాదేవి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని అర్హులకు న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష పథకమని సచివాలయాల మండల కన్వీనర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కల్లూరు రమణారెడ్డి వివరించారు. బుధవారం మండలంలోని టేకూరుపేట, తిమ్మారెడ్డిపల్లె, యరసాల, కవలకుంట్ల సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ సమావేశంలో రమణారెడ్డి మాట్లాడారు. శిక్షణలో సచివాలయాల కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేసి ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి కారణాలు తెలుసుకోవాలన్నారు. అలాంటి వారికి అవసరమైన సర్టిఫికెట్ల కోసం సచివాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహశీల్దారు గంగయ్య, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం '

అట్లూరు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని మండల సచివాలయాల కన్వీనర్ మణ్యం మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరు, కుంభగిరి, తంభళ్లగొంది సచివాలయాలలో మంగళవారం సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులకు జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఓ సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో జగనన్న సురక్ష శిబిరాలు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో జగనన్న సురక్ష శిబిరాలను జూలై 1 నుంచి నిర్వహించనున్నారు. మున్సిపాలిటీలో ప్రతి సచివాలయం పరిధిలోని వారు ప్రభుత్వ పథకాలను అందుకునేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఈ శిబిరాల్లో అందజేస్తారు. మున్సిపాలిటీలో జూలై 1వ తేదీన పట్టణంలోని వినాయకనగర్ 8వ సచివాలయం, 3వ తేదీన నంద్యాల రోడ్డులోని 9వ సచివాలయం, 5వ తేదీన విజయనగర కాలనీలోని 10వ సచివాలయం, 7వ తేదీన సీతారామాంజనేయ నగర్‌లోని 11వ సచివాలయంలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి తెలిపారు. అలాగే జూలై 10వ తేదీన పట్టణంలోని సర్వాయిపల్లె రోడ్డు సచివాలయం-1లో, 14వ తేదీన మంగళవీధిలోని 5వ సచివాలయంలో, 17వ తేదీన వాసవి నగర్‌లోని 4వ సచివాయలంలో, 19వ తేదీన జోసెఫ్‌పేటలో ఉన్న 3వ సచివాలయంలో, 21వ తేదీన శెట్టివారిపల్లెలోని 2వ సచివాలయంలో, 24వ తేదీన కృష్ణాపురంలోని 1వ సచివాలయంలో శిబిరాలను నిర్వహిస్తామని కమిషనర్ వివరించారు.

గోపవరం : జూలై 1వ తేదీ నుంచి ప్రారంభించే జగనన్న సురక్ష కార్యక్రమంపై ముందుగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల కోసం అవసరమయ్యే 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా లబ్ధిదారులకు చేరవేయనున్నారు. జూలై 1 నుంచి నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుల నుంచి వచ్చిన సర్టిఫికెట్లను తయారు చేసి లబ్ధిదారులకు అందించనున్నారు. మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణలు సమీక్షిస్తున్నారు. ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ప్రొద్దుటూరు : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని చేపట్టే ధర్నా కరపత్రాలను స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను షాక్‌కు గురిచేసిందన్నారు. ఈనెల 30న ప్రొద్దుటూరు విద్యుత్ కార్యాలయం వద్ద చేపట్టా ధర్నాకు ప్రజా సంఘాలు, వామపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.శేఖర్, వై.చెన్నారెడ్డి, ఎం.శ్రీను, మధు, రవి పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



జాతీయ ఇంధన భద్రత వారోత్సవాల్లో విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు

ప్రొద్దుటూరు : వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఈఈ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక పవర్ హౌస్ కాంపౌండ్‌లో బుధవారం జాతీయ ఇంధన భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఇంధన భద్రత ఉత్సవాలు ఈనెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించడం ద్వారా విద్యుత్‌ను పొదుపు చేయవచ్చన్నారు. గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ పరికరాలు ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, భద్రతా ప్రమాణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

గృహయోగం



ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో..

మంజూరైన ఇళ్ల స్థలాలు:	13,436
నిర్మాణంలో ఉన్నవి:	5,200
పునాది దశలో ఉన్నవి:	7,350
గోడలు పూర్తయినవి:	780
స్లాబులు పూర్తయినవి:	116
ఇల్లు పూర్తయినవి:	16

ప్రొద్దుటూరు మండలపరిధిలో..

మంజూరైన ఇళ్లు:	6,040
పునాది దశలో ఉన్నవి:	2,457
గోడలు పూర్తయినవి:	289
స్లాబులు పూర్తయినవి:	416
పూర్తయిన ఇళ్లు:	520

ప్రొద్దుటూరు : 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఒక్క ఇల్లు నిర్మించలేదు. ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రభుత్వ నిబంధనలు కఠినతరంగా ఉండటంతోపాటు అపార్ట్‌మెంట్‌తరహాలో ఇళ్లు ఇస్తుండటంతో ఎవరూ ముందుకు రాలేదు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేల సంఖ్యలో లబ్ధిదారులు ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణ చుట్టూ బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం ప్రాంతాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. మూడు కాలనీల్లో దాదాపుగా 24 వేల ఇళ్లను మంజూరు చేశారు. చాలా వరకు పూర్తయ్యాయి.



ఈమె పేరు సాత్రి దానమక్క. దానమక్కతోపాటు ఆమె భర్త కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి వరకు సొంత ఇల్లు లేని వీరు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వరాజ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈమెకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. పట్టణానికి సమీపంలోని బొల్లవరం జగనన్న కాలనీ లే అవుట్‌లో ఈమె సొంతంగా ఇల్లు నిర్మించుకొంటోంది. ఇంత కాలం తర్వాత మకు ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందని, తామే సొంతంగా ఇల్లు నిర్మించుకుంటున్నామని ఆమె తెలిపింది.